ప్రమాదాలకు కేరాఫ్ బీబీ గూడెం అండర్ పాస్

- మితిమీరిన వేగంతో రాకపోకలు
- స్పీడ్ బ్రేకర్ తొలగించడంతో తరుచుగా ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్ నిర్మించాలని గ్రామస్తుల వినతి


బీబీ గూడెం ప్లై ఓవర్ అండర్ పాస్


స్పీడ్ బ్రేకర్ తొలగించిన చోట రాళ్లు పెట్టిన దృశ్యం

గన్నవరంరూరల్: మండలంలోని బీబీ గూడెం ప్లై ఓవర్ వద్ద ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. సోమవారం ఉదయం గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీంతో స్థానికులు వాహనాలు వేగంగా రాకుండా రాళ్లను అడ్డుగా పెట్టారు. కనీసం ఆ రాళ్లు చూసి వాహనాలు వేగం తగ్గుతాయని భావిస్తున్నట్లు పలువురు తెలిపారు. బీబీ గూడెం ప్లై ఓవర్ దిగువన గన్నవరం నుంచి వాహనాలు బీబీ గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, తోటపల్లి, ఆగిరిపల్లి గ్రామాల మీదుగా నూజివీడు రాకపోకలు సాగిస్తాయి. కొత్తగా హైవే బైపాస్ నిర్మించటంతో దానికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మాణం కావటంతో నున్న నుంచి వాహనాలు నేరుగా చిన అవుటపల్లి వరకు వెళ్తున్నాయి. ఈ రోడ్డు హైవే బైపాస్ కావటం, ఎంతో విశాలంగా నిర్మాణం కావటంతో అతివేగంగా వాహనాలు నడుస్తున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

సర్వీస్ రోడ్డు దిగే క్రమంలో గతంలో ఈ ప్లై ఓవర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. ఇప్పటికీ పలు స్పీడ్ బ్రేకర్లు అక్కడ ఉన్నాయి. అయితే నున్న వైపు నుంచి వస్తూ బీబీ గూడెం వద్ద సర్వీస్ రోడ్డుపైకి వచ్చే క్రమంలో స్పీడ్ బ్రేకర్ తొలగించడంతో వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. ఈ క్రమంలో గన్నవరం నుంచి బీబీ గూడెం, బీబీ గూడెం వైపు నుంచి గన్నవరం వెళ్లే వాహనాల పైకి వస్తుండటంతో, స్పీడ్ బ్రేకర్ లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తరుచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు గాయాల బారిన పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో సర్వీస్ రోడ్డుపై ఇక్కడ నిర్మించిన స్పీడ్ బ్రేకర్ తొలగించటమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఇక్కడే ప్రమాదాలు జరుగుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. గతంలో సర్వీస్ రోడ్డుపై తొలగించిన స్పీడ్ బ్రేకర్ స్థానంలో మరలా స్పీడ్ బ్రేకర్ నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోజూ రోడ్డు నెత్తురోడుతోంది


సోమవారం ఒక్క రోజే రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కనీసం వాహనాలను కూడా ఆపకుండా అతివేగంగా వెళ్లిపోయారు. రోజూ ఇక్కడ రోడ్డు నెత్తురోడుతోంది. ప్రాణాలు కోల్పోవడంతో పాటు దెబ్బలు తగులుతున్నాయి.

– జంపన పిచ్చిమ్మ, స్థానికురాలు, గొల్లనపల్లి

స్పీడ్ బ్రేకర్ తొలగించటంతో..


గతంలో ఇక్కడ సర్వీస్ రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ తొలగించటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గన్నవరం నుంచి వచ్చే వాహనాలు, నున్న వైపు నుంచి వచ్చే వాహనాలు ఢీ కొంటున్నాయి. జాతీయ రహదారుల శాఖ చర్యలు తీసుకోవాలి.

– తాటి శ్రీనివాసరావు, గ్రామస్తుడు, బీబీగూడెం

అధికారులు స్పందించాలి


అధికారులు ఇక్కడ ప్రమాదాలపై దృష్టి సారించాలి. సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. కనీసం బోర్డులు లేవు. అధికారులు వెంటనే స్పందించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– గండికోట నాగార్జున, గ్రామస్తుడు, బీబీ గూడెం

క్లుప్తంగా

రైతులకు వెంటనే పెట్టుబడి సాయం ఇవ్వాలి

గన్నవరం: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ వెంకటశివయ్యకు అన్నదాతల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. సాగు చేసే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్న ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నప్పటికీ రూపాయి కూడా చెల్లించకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో 40వేలకు పైగా సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురై కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదన్నారు. ఈ చెరువుల పునరుద్ధరించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. రబీ సీజన్‌లో రైతులు చెల్లించాల్సిన పంటల బీమా సొమ్మును ప్రభుత్వమే భరించాలని విన్నవించారు. రైతు సంఘ నేతలు వెంగళ శివయ్య, రంగారావు, కట్టవరపు విజయరావు, మోహన్‌రావు, నూతక్కి మోహన్‌రావు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌తో ప్రగతి



పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్ దేశ ప్రగతికి ఎంతో తోడ్పడుతుందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కాలేజీలో ఈ నెల 11వ తేదీ నుంచి 15 వరకు టోటల్ స్టేషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాబోయే రోజుల్లో సివిల్ ఇంజినీరింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతుందన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ.. రహదారుల అభివృద్ధి, భవనాల నిర్మాణానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉయోగపడుతుందన్నారు. చెన్నైకు చెందిన లాడర్ సర్వే ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఎంఆర్.దినేష్ శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులకు జైలుశిక్ష, జరిమానా

గన్నవరం: దుకాణంలోకి అక్రమంగా చొరబడి యజమానిని కొట్టిన ఇద్దరు నిందితులకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన సమాచారం ప్రకారం.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పసుపులేటి సీతారామయ్య బేకరీ షాపు నడుపుతున్నాడు. 2021 జూన్ 26న ముఖాలకు మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు అతని షాపులోకి చొరబడ్డారు. ఒక్కసారిగా సీతారామయ్యపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఈ సంఘటనలో గాయపడిన సీతారామయ్య పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లికి చెందిన పడమట గోపాలకృష్ణ, ఆత్కూరుకు చెందిన కటికల రాజేష్ ఈ దాడి చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం స్థానిక 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజుకు కావడంతో ఇద్దరు నిందితులకు కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల అదనంగా జైలుశిక్షను అమలు చేయాలని కోర్టు తీర్పులో పేర్కొంది. గన్నవరం పోలీసులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.మాధవి వాదనలు వినిపించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

గన్నవరం: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం అదుపులో తీసుకున్నారు. మండలంలోని సూరంపల్లి, చనుపల్లివారిగూడెం, సవారగూడెం, స్థానిక కోనాయి చెరువు వద్ద అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 74 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం పట్టుబడిన మద్యం విక్రయదారులను స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించడంతో కేసులు నమోదు చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కంకిపాడు: కంకిపాడు పట్టణంలో అయ్యప్ప స్వామి వారి గ్రామోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా సాగింది. పట్టణంలోని శివాలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయ్యప్పస్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. అయ్యప్ప మాలధారులు ఊరేగింపులో పాల్గొని రంగులు చల్లుకుంటూ, ప్రత్యేకంగా అలంకరణ చేసుకుని పేటతుళ్లి ఆడి భక్తిపారవశ్యం చెందారు. తొలుత ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, బాధితులు

ఉంగుటూరు: వరదలు సంభవించి రెండు నెలలు గడిచినా నేటికి వరద నష్ట పరిహారం అందించకపోవడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాల కారణంగా నీట మునిగిన ఇళ్లకు నష్టపరిహారం ఇంకా రానివారికి నష్ట పరిహారం అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో వెల్దిపాడు గ్రామ సచివాలయం వద్ద బాధితులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 332 రేషన్‌కార్డులు ఉండగా 292 మందికి నష్టపరిహారం అందించి మిగిలిన వారికి ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. జిల్లా కలెక్టర్, తహసీల్దారుకు మూడు సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వోతో ఫోన్‌లో మాట్లాడగా నష్టపరిహారం అందని వారి జాబితాను తయారు చేసి తహసీల్దారుకు నివేదిక పంపుతామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, నాయకులు విజయకుమారి, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం


విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఉయ్యూరు: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో విశ్రాంత హెచ్‌ఎం హసన్ అహ్మద్, జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ సెక్రటరీ నెల్లి రాంబాబు, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గొప్ప మార్పు

పెనమలూరు: విద్య సమాజంలో గొప్ప మార్పు తీసుకు వస్తుందని పీబీ సిద్ధార్థ ఆంగ్ల విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీలత అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం, సాహిత్య ఉత్సవం, భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. చదువుకోవటం వలన జీవితంలో గొప్పమార్పురావటమే కాకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామన్నారు. గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోని, ప్రేరణపొంది నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ విద్యావంతులు సమాజంలో గౌరవించబడతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వక్తృత్వ పోటీలు, సృజనాత్మకత రచనలు, పద్య పఠనం వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్టీటీఎఫ్ కళాశాలలో ఈ నెల 14వ తేదీన లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు దండమూడి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన లయన్స్‌క్లబ్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసేందుకు ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

గ్యాంగ్‌వార్ కేసులో మరో 8 మంది అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురు గ్యాంగ్‌వార్ కేసులో మరో 8 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న యనమలకుదురు పెట్రోల్ బంక్ వద్ద ఇరు వర్గాల మధ్య గ్యాంగ్‌వార్ జరిగింది. కత్తులు, బీర్ సీసాలు, మారణాయుధాలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఇప్పటికే 9 మంది నిందితులను అరెస్టు చేశారు. మరో వర్గానికి చెందిన 8 మంది నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మనోజ్, కిరణ్‌జోజి, సంతోష్, కొప్పాడి చందు, పోలేపల్లి దినేష్, కొడాలి డోలాస్‌కుమార్, జఠావత్ సన్నీ, బడుగు ఆదిత్య ఉన్నారు. ఈ కేసులో ఇంకా పలువురు నిందితులు పరారీలో ఉన్నారు.

సోలార్ విద్యుత్ పథకంపై అవగాహన సదస్సు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం తెలిపారు. బాపులపాడు మండలం వేలేరులో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ వినియోగం సామర్థ్యాన్ని బట్టి ఈ పథకం కింద రూ.78 వేలు వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. ఇంటి వినియోగానికి మించి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి ప్రభుత్వానికి విక్రయించుకునేందుకు కూడా అవకాశం ఉందని ఎస్ఈ తెలిపారు. ఈ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సీపీడీసీఎల్ గుడివాడ డీఈ సుధాకర్, హనుమాన్‌జంక్షన్ ఏడీఈ శ్రీనివాసరావు, వీరవల్లి ఏఈ మురళీకృష్ణారావు, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ


యనమలకుదురులో పూజలు చేస్తున్న భక్తులు


పెదపులిపాకలో వివిధ ఆకృతుల్లో వెలిగించిన దీపాలు

కంకిపాడు/ఉయ్యూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో కార్తిక మాసం రెండో సోమవారం పూజలు వైభవంగా నిర్వహించారు. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి స్వామివార్లని దర్శించుకుని పూజలు చేశారు. కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లోని పలు ఆలయాలు భక్తులు రద్దీతో కిటకిటలాడాయి. ప్రొద్దుటూరు శివాలయంలో విశ్వేశ్వరస్వామి గా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు.

పెనమలూరులో..

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఉదయం స్వామివారికి ఐదు సార్లు రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగించారు. శివసాధంలో స్వామివారి శాంతికల్యాణం ఘనంగా చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెదపులిపాక శ్రీవిజయరాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు దీపారాధన చేశారు.

శివయ్యకు రుద్రాభిషేకం

రామవరప్పాడు: స్థానిక పిన్నమనేని హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో పలు అభిషేకాలు చేశారు. ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద రుద్రాభిషేకం, పంచ హారతులు, నక్షత్ర హక్కులు పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పెరికీడు, కానుమోలు, వీరవల్లి శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పెరికీడులలోని ముక్తికాంత సమేత ముక్తేశ్వరాలయం, వీరవల్లిలోని గంగా పార్వతి సమేత కొండేశ్వర స్వామి దేవస్థానం, కానుమోలులోని గంగా, బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. స్వామివారికి ఆవు పాలు, ఆవు నెయ్యి, తేనె, పన్నీరు. విభూది, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అభిషేక ప్రియుడైన భోళాశంకరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, బిల్వార్చనలు చేపట్టారు.


ప్రొద్దుటూరులో విశ్వేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో కొండేశ్వరస్వామి


ఉయ్యూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రామవరప్పాడులో స్వామివారికి పంచ హారతులు ఇస్తున్న భక్తులు

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటాం


మోహన్‌రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: తెన్నేరు గ్రామ సర్పంచ్ జుజ్జవరపు ఎలీషాకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి జుజ్జవరపు మోహన్‌రావు(76) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. మోహన్‌రావు భౌతికకాయాన్ని స్వగ్రామమైన తెన్నేరుకు తరలించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి సందర్శించి నివాళులర్పించారు. మోహనరావు మృతికి గల కారణాలను సర్పంచ్ ఎలీషా, ఇతర కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని ధైర్యం చెప్పారు. సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, అగ్రి బోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, జేపీసీ మాజీ చైర్మన్, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, మేరుగు విజయ చంద్రశేఖర్, నాయకులు కలపాల వజ్రాలు, దండాబత్తిన సుబ్బారావు, లాం సురేష్, మాగంటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

గన్నవరం: మండలంలోని గృహ, వాణిజ్య, ఇండస్ట్రీయల్ విద్యుత్ సర్వీస్‌లను సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు నేతృత్వంలో 41 ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు చేసి రూ.8 లక్షలు జరిమానా విధించారు. తొలుత మండల పరిధిలోని 2,192 గృహ సర్వీస్‌లను, 123 వాణిజ్య, 13 ఇండస్ట్రీయల్ సర్వీస్‌లను తనిఖీలు చేశారు. వీటిలో అదనపు లోడు వినియోగిస్తున్న 167 సర్వీస్‌లకు రూ.7.50 లక్షలు, విద్యుత్ చౌర్యం చేస్తున్న ఇద్దరికి రూ.50 వేలు జరిమానా విధించారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం సామాజిక నేరామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతుంటే 94408 12362, 94408 12363, 83310 14951 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీల్లో గుణదల ఈఈ పి.హరిబాబు, డీఈఈ ఈ.రామ్మూర్తి, గన్నవరం ఏఈ ఎం.వెంకటరాజు, గుణదల డివిజనల్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు


వీరవల్లి వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం వీరవల్లి వద్ద ట్రాక్టర్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జాతీయ రహదారి నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టు సంస్థకు చెందిన ట్రాక్టర్ రహదారిపై నిలిపి ఉంచటంతో కారు ఢీ కొట్టింది. ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపి పనులు నిర్వహిస్తున్న తరుణంలో ఎలాంటి సూచిక బోర్డులు పెట్టకపోవటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు. హైవే కాంట్రాక్టు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ అప్పారావు తదితరులు

రామవరప్పాడు: జేఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ కరాటే మెన్స్, ఉమెన్స్ టోర్నమెంట్ పోటీల్లో విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించారని కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. ఈనెల 8న నర్సాపూర్‌లోని స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెంట్రల్ జోన్ కరాటే మెన్స్, ఉమెన్స్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల విద్యార్థులు పి.పూజిత్, ఆర్. సాత్విక జేఎన్టీయూ కాకినాడ టీమ్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీ కృష్ణ, ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ శరత్‌లు అభినందించారు.